

పెనుమంత్రలో వర్షం

ప్రజాశక్తి - పెనుమంత్ర

ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి మండలంలోని గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలో 12 సెంటీమీటర్ల మేరకు వర్షపాతం నమోదైందని సంబంధిత అధికారులు వెల్లడించారు. రోహిణీ కార్తె నేపథ్యంలో ఒక పక్క ఎండ, మరో పక్క ఉక్కపోతతో విలవిల్లాడిన ప్రజానీకానికి ఈ వర్షం ఉపశమనం కలిగించింది.



పెనుమంత్రలో కురుస్తున్న వర్షం

కౌంటింగ్‌కు సర్వం సన్నద్ధం

- అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసిన రెండు జిల్లాల అధికారులు
- ఏలూరు, పశ్చిమలో వెయ్యి మంది చొప్పున కౌంటింగ్ సిబ్బంది
- కౌంటింగ్ కేంద్రాల వద్ద 600 మంది వరకూ పోలీసులు
- అసెంబ్లీ, పార్లమెంట్‌కు 14 టేబుల్స్ చొప్పున ఏర్పాటు
- పోలైన ఓట్లను బట్టి 16 నుంచి 21 రౌండ్లలో పూర్తి ఫలితం
- తొలుత పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు
- సమస్యాత్మక గ్రామాల్లో ముందుగానే పోలీసుల మోహరింపు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రెండు జిల్లాల అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఈ నెల నాలుగో తేదీ మంగళవారం జరగనున్న కౌంటింగ్ ప్రక్రియపై ఇప్పటికే రెండు జిల్లాల కలెక్టర్లు అవసరమైన ముందస్తు చర్యలన్నీ తీసుకున్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి సిబ్బంది కేటాయింపు, వారికి శిక్షణ, పోస్టల్ బ్యాలెట్ ఏవిధంగా లెక్కించాలి, ఎన్ని టేబుళ్లు ఏర్పాటు చేయాలి, ఎన్ని రౌండ్లలో ఫలితాలు వెల్లడించాలి, పోలీస్ బందోబస్తు ఏవిధంగా ఉండాలి వంటి అనేక అంశాలపై పూర్తిస్థాయిలో సన్నద్ధం చేశారు. ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానం ఉండగా అన్ని నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఏలూరులోని సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 14 చొప్పున టేబుల్స్ ఏర్పాటు చేశారు. పార్లమెంట్‌కు అదేవిధంగా టేబుళ్ల ఏర్పాటు జరిగింది. కౌంటింగ్‌కు సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రోఅబ్జర్వర్లు ఇతర సిబ్బందిని మొత్తం వెయ్యి మంది వరకూ నియమించారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించేలా ఏర్పాట్లు చేశారు. ఏలూరు జిల్లాలో 17,500 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. వీటిని ముందుగా లెక్కిస్తారు. అనంతరం ఇవిఎంల ఓట్ల లెక్కింపు సాగనుంది. ఉంగుటూరు, ఏలూరు నియోజకవర్గాల ఓట్లు 16 రౌండ్లలో, కైకలూరు 17, దెందులూరు 18, చింతలపూడి 20, నూజివీడు 21, పోలవరం నియోజకవర్గ ఓట్లు 21 రౌండ్లలో లెక్కించనున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏలూరు జిల్లాలో కౌంటింగ్ కేంద్రం వద్ద 600 మంది పోలీసులను మోహరించేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రతి నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రాన్ని ఒక డిఎస్‌పి పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా సమస్యాత్మక గ్రామాల్లో ముందుగానే 20 మంది చొప్పున పోలీసులను మోహరిస్తున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానం ఉన్నాయి. ఈ జిల్లాకు సంబంధించి రెండు కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎస్ఆర్‌కెఆర్ కాలేజీలో భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల కౌంటింగ్, విష్ణు కాలేజీలో ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు సాగనుంది. ఈ జిల్లాలో నియోజకవర్గానికి 14 టేబుల్స్ చొప్పున ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌కు 1,045 మంది సిబ్బందిని నియమించారు. ఈ జిల్లాలో 13,345 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. ముందుగా ఈ ఓట్లను లెక్కించనున్నారు. ఈ జిల్లాలో సైతం కౌంటింగ్ కేంద్రాల వద్ద 600 మందికిపైగా పోలీసులను బందోబస్తుకు వినియోగిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన 137 గ్రామాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేస్తున్నారు. బాణసంచా కాల్చడం, మద్యం అమ్మకాలను నిషేధించారు. ఏజెంట్లు ఏ విధంగా వ్యవహరించాలనే అంశాలపై ముందుగానే శిక్షణ ఇచ్చారు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య కౌంటింగ్ ప్రక్రియను జరిపేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు.

నాయకుల్లో టెన్షన్.. టెన్షన్

కౌంటింగ్ ప్రక్రియ దగ్గర పడటంతో ఇరు పార్టీల నాయకుల్లో టెన్షన్ నెలకొంది. ఫలితం ఎలా ఉంటుందోననే ఆందోళన అందరిలోనూ కన్పిస్తోంది. ఎగ్జిట్‌పోల్స్ వెలువడిన తర్వాత రెండు జిల్లాల్లోనూ భారీగా పందేలు సాగుతున్నాయి. మండలాలు, గ్రామాలవారీగా సైతం పందేలు నడుస్తున్నాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ మెజార్టీ వస్తే ఒకవిధంగా, ఏయే మండలాల్లో మెజార్టీ వస్తుందంటూ మరోవిధంగా పందేలు సాగాయి. కౌంటింగ్ ప్రక్రియ దగ్గర పడుతున్న కొద్దీ పందేల జోరు మరింత పెరుగుతున్న పరిస్థితి కన్పిస్తోంది.

ఓట్లు లెక్కింపునకు సర్వం సిద్ధం

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్



మాట్లాడుతున్న సుమిత్ కుమార్

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధంగా ఉన్నట్టు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్ వద్ద కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల సంయుక్తంగా పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించి ఓట్లు లెక్కింపు ఏర్పాట్లను వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని తెలిపారు. జిల్లాకు సంబంధించి భీమవరంలో రెండు ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు సంబంధించి ఎస్ఆర్‌కెఆర్ కళాశాలలో, ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజకవర్గాలకు సంబంధించి విష్ణు కాలేజీలో ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 14,72,923 మంది ఓటర్లు ఉండగా పురుషులు 7,21,532 మంది, స్త్రీలు 7,51,313 మంది, ఇతరులు 78 మంది ఉన్నారన్నారు. వారిలో ఓటు వినియోగించుకున్న వారు మొత్తం 12,16,558 మంది ఉండగా, వారిలో పురుషులు 6,02,480 మంది, స్త్రీలు 6,14,031 మంది, ఇతరులు 47 మంది ఉన్నారని తెలిపారు.

హోమ్ ఓటింగ్ (850) వివరాలు

మొత్తం 1,072 మంది 85 ఏళ్ల వయసు కలిగిన వారు హోమ్ ఓటింగ్ వినియోగించుకోగా, వీరిలో 09 పార్లమెంటరీ నియోజకవర్గంలో 536 మంది, ఆచంటలో 39 మంది, పాలకొల్లులో 165 మంది, నరసాపురం 60 మంది, భీమవరంలో 57 మంది, ఉండిలో 65 మంది, తణుకులో 81, తాడేపల్లిగూడెంలో 69 మంది హోమ్ ఓటింగ్ ఉపయోగించుకున్నట్లు తెలిపారు.

పిడబ్ల్యుడి ఓటింగ్ వివరాలు

మొత్తం 1,022 మంది వికలాంగులు హోం ఓటింగ్ వినియోగించుకోగా, వీరిలో 09 నరసాపురం నియోజకవర్గంలో 553, నియోజకవర్గాల వారీగా ఆచంట 48, పాలకొల్లు 154, నరసాపురం 46, భీమవరం 50, ఉండి 81, తణుకు 93, తాడేపల్లిగూడెం 81 మంది హెూమ్ ఓటింగ్‌ను వినియోగించుకున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 13,345 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోగా, నియోజకవర్గాల వారీగా ఆచంటలో 1430 మంది, పాలకొల్లులో 2,143 మంది, నరసాపురంలో 1,566 మంది, భీమవరంలో 2,598 మంది, ఉండిలో 1,631 మంది, తణుకు 2,082, తాడేపల్లిగూడెం 1,895 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నట్లు తెలిపారు. పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుల్స్ పోస్టల్ బ్యాలెట్ కు, ఒక టేబుల్ ఇటిపిబిఎస్ ఓట్ల లెక్కింపునకు వినియోగించడం జరుగుతుందన్నారు. పార్లమెంట్‌కు సంబంధించి విష్ణు కాలేజీ లైబ్రరీ రీడింగ్ రూమ్ గ్రౌండ్ ఫ్లోర్ నందు లెక్కింపు జరుగుతుందన్నారు. పార్లమెంటరీ కాన్స్టెన్సీకి 14 టేబుల్స్, అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుల్స్ చొప్పున ఏడు నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లలో లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఓట్ల లెక్కింపుకు 265 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్స్, 431 మంది కౌంటింగ్ అసిస్టెంట్స్, 297 మంది మైక్రో అబ్జర్వర్స్, 52 మంది ఎఆర్ఒస్ విధులను కేటాయించగా, 20 మంది చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లను, 147 మంది కౌంటింగ్ ఏజెంట్లను వివిధ రాజకీయ పార్టీల తరఫున నియమించడం జరిగిందన్నారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రాలు భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు కౌంటింగ్ పరిశీలకులుగా ఎం.దీప వ్యవహరిస్తారన్నారు. అలాగే విష్ణు కాలేజీలో ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల కౌంటింగ్ పరిశీలకులుగా డాక్టర్ బన్సిధర్ కుమవాట్, అలాగే నరసాపురం, తణుకు నియోజవర్గాలకు కౌంటింగ్ పరిశీలకులుగా ఎల్.నిర్మల్ రాజ్ వ్యవహరిస్తారని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతతకు భంగం కలిగించే ఏ విషయాన్ని అయినా ఉపేక్షించేది లేదన్నారు. ఈ ప్రాంతానికి సంబంధం లేని వ్యక్తులు సరైన కారణం లేకుండా కౌంటింగ్ కేంద్రాల పరిధిలోని హోటళ్లు, లాడ్జిలో బస చేయకూడదన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. జిల్లాలోని 137 గ్రామాల్లో పికెటింగ్ కొనసాగుతుందన్నారు. ఆరు వేల మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. లెక్కింపును ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఉండిలో భారీ మెజార్టీతో గెలుస్తా

టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి రఘు రామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల



ఉండి నియోజకవర్గంలో భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘు రామకృష్ణంరాజు ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఉండి నియోజకవర్గం టిడిపికి కంచుకోట కావడంతో టిడిపి కేడర్‌తో పాటు జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో సహకరించారని తెలిపారు. జనసేన కేడర్ ఉత్సాహంతో పని చేయడంతో టిడిపికి ఓట్ల షేరింగ్ జరిగిందన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి భారీగా పోలింగ్ శాతం పెరిగిందన్నారు. పెరిగిన ఓటింగ్ శాతంలో యువ ఓటర్లు, మహిళలే కీలకపాత్ర పోషించారని భావిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక ఓటింగ్ టిడిపికి అనుకూలంగా పడ్డాయన్నారు. 46 గ్రామాల్లో 90 శాతానికిపైగా పోలింగ్ నమోదైందన్నారు. పెరిగిన ఓటర్లు టిడిపికి సానుకూలంగా వేయడం వంటి అంశాలు గెలుపునకు దోహద పడనున్నాయని తెలిపారు. ఉండిలో టిడిపి భారీ మెజార్టీతో గెలుస్తుందన్నారు.

నిత్యం ప్రజల్లో ఉంటా.. అందుకే గెలిపిస్తున్నారు

టిడిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు



నియోజకవర్గంలో వరుసగా మూడోసారి ఎన్నికై హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయనను ప్రజాశక్తి పలుకరించగా పలు విషయాలు వెల్లడించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించే నేతలకు ఏ నియోజకవర్గంలోనైనా ప్రజలు ఆదరిస్తారని చెప్పారు. ఐదేళ్లలో జగన్ అరాచక పాలనకు వ్యతిరేకంగా మంగళవారం ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తున్నారని చెప్పారు. తాను 20 సంవత్సరాల కిందట ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో తన తండ్రి పేరున ధర్మారావు ఫౌండేషన్ ఏర్పాటు చేశానని, ఎందరో వృద్ధులు, మహిళలు, వికలాంగులు, విద్యార్థులు ఇలా దాదాపు ప్రతి నెలా ఏదో కార్యక్రమం ద్వారా వారిని ఆదుకుంటున్నానని తెలిపారు. తనకు కోట్ల రూపాయల ఆస్తి లేదని, కేవలం 20 ఎకరాల పొలం ఉంటే దానిలో 10 ఎకరాలు ఫౌండేషన్ ద్వారా ప్రజలకు సేవ చేస్తున్నానని చెప్పారు. తనకు ఎంఎల్ఎ కంటే ఫౌండేషన్ ద్వారా సేవ చేయడం ఇష్టమన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 2014 - 19 మధ్య రూ.600 కోట్లకు పైగా నిధులు తెచ్చి అభివృద్ధి చేశానని చెప్పారు. నిధులు తేవడమే కాకుండా నిధులు ఖర్చు చేసేచోట తాను పర్యవేక్షిస్తూ పని పూర్తయ్యేలా చేశానని చెప్పారు. టిడిపి అధికారంలో లేకపోయినా గత ఐదేళ్లుగా వైసిపి యేతర ఎంపీల నిధులు తీసుకొచ్చి నియోజకవర్గంలో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. పాలకొల్లు పట్టణం అమృత్ పథకంలో లేకపోయినా చంద్రబాబు సహకారంతో రూ.600 కోట్లతో టిడ్కో గృహాలు నిర్మించినట్లు చెప్పారు. పట్టణంలో రూ.15 కోట్లతో రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించామని, రూ.10 కోట్లతో ఎన్‌టిఆర్ కళావేదిక, రూ.12 కోట్లతో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, హిందూ శ్మశానవాటిక, 2 పార్కులు ఇలా ఎన్నో శాశ్వత పథకాలు నిర్మించినట్లు చెప్పారు. అందుకే ప్రజలు తనను ఆదరించి గెలిపిస్తున్నారని, వారికి ఇంకా సేవలు చేస్తానని చెప్పారు.



వర్షం పడుతున్నా చేస్తున్న వీరవాసరం - పెనుమంత్ర తారురోడ్డు పనులు

జోరువానలో పనులేలా..!

తారురోడ్డు నిర్మాణంపై పలువురు విస్మయం

ప్రజాశక్తి - వీరవాసరం

సుమారు రూ.ఆరు కోట్లతో అభివృద్ధి చేస్తున్న వీరవాసరం - పెనుమంత్ర ఆర్అండ్‌బి తారు రోడ్డు పనులు వర్షం వస్తున్నా కొనసాగించడంతో దాని నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు ఇవేం పనులంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. న్యూ డవలప్‌మెంట్ బ్యాంకు నిధులు రూ.1.5 కోట్లు, ఆర్అండ్‌బి నిధులు రూ.మూడు కోట్లతో ఆరు కిలోమీటర్ల మేర చేపట్టిన ఈ అభివృద్ధి పనులు గత కొద్ది రోజులుగా జరుగుతున్నాయి. మూడేళ్ల క్రితం ఈ పనులకు ఆమోదం లభించినప్పటికీ కాంట్రాక్టుదారుడికి, రాష్ట్రంలో ఇతర పనులకు సంబంధించి బిల్లులు చెల్లింపుల పట్ల ప్రభుత్వం జాప్యం చేయడంతో పనులు ప్రారంభించడానికి ముందుకు రాని పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకు ఇటీవల ఎన్నికల ముందు భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ కాంట్రాక్టర్‌ను సంప్రదించి పనులు చేపట్టే విధంగా కోరడంతో కాంట్రాక్టుదారుడు పనులు ప్రారంభించడంతో ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. అంతాబాగానే ఉన్నా జోరు వర్షంలోనూ తారు రోడ్డు పనులు కొనసాగించడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధంగా వర్షంలో పనులు చేస్తే దాని నాణ్యం ఎంత మేరకు ఉంటుందనే సందేహం వ్యక్తమవుతోంది. రెండు రోజులుగా వాతావరణం మార్పులు కనిపిస్తున్నప్పటికీ అందుకు అనుగుణంగా పనులును కొనసాగించడం నిలుపుదల చేయడంలో అటు కాంట్రాక్టుదారుడు గానీ ఇటు ఆర్అండ్‌బి అధికారి గానీ ఆలోచన చేయకపోవడం గమనార్హం. మండలంలో పాడైపోయిన రోడ్ల దుస్థితిపై అనేక దఫాలుగా సిపిఎం పోరాటాలు చేసి పాడైపోయిన రోడ్ల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పోరాటాలు చేసినా స్పందించని నేపథ్యంలో వేస్తున్న తారు రోడ్ల పనుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోవడం, పనులు జరుగుతున్న ప్రాంతంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వంటి కారణాలు వారి నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది. అదేవిధంగా పనులు కొనసాగితే కొద్ది రోజుల్లోనే రోడ్డు పాడైపోయి మరలా ఎప్పటిలాగేనే ప్రజలు ఇటుగా రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడే పరిస్థితులు పునరావృతం అవుతాయనడంలో సందేహం లేదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పనులు నిర్వహణ పట్ల అధికారులు దృష్టి పెట్టాలని జనం కోరుతున్నారు.

కార్మికుల కనీస వేతన చట్టాన్ని సవరించండి

రైస్ మిల్లు కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వాసుదేవరావు

ప్రజాశక్తి - ఆకివీడు



మాట్లాడుతున్న వాసుదేవరావు

రాష్ట్రంలో కొత్తగా రానున్న ప్రభుత్వం రైస్ మిల్లు కార్మికుల కనీస వేతన చట్టాన్ని సవరించి వెంటనే విడుదల చేయాలని రైస్ మిల్లు కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు డిమాండ్ చేశారు. ఈ చట్టం ద్వారా కార్మికుల కనీస వేతనాన్ని రూ.25,000గా నిర్ణయించాలన్నారు. మండలంలోని సిఐటియు అనుబంధ రైస్ మిల్ కార్మికుల సాధారణ సమావేశం ఆదివారం స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో సంఘం నాయకులు తమ్మిశెట్టి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ కనీస వేతన చట్టాన్ని సవరించి పది సంవత్సరాలు దాటిందన్నారు. అయితే ఈ దశలో రైస్ మిల్లు కార్మికుల స్థితిగతులను పట్టించుకోలేదన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయంగా రద్దు చేశాయన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక బిల్లులు పార్లమెంట్‌లో ప్రవేశపెడితే రాష్ట్రంలోని వైసిపి, టిడిపి రెండూ ఆ బిల్లులకు మద్దతు పలికాయన్నారు. సమావేశంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు పెంకి అప్పారావు, కె.తవిటినాయుడు, బుర్ర.శీను, గండేటి ఈశ్వరరావు, వై.రత్తయ్య, నిమ్మల శీను, బడుగు.కొండ, ఎర్ర.శీను, రాము, రమణ, రామ ప్రసాద్, నడిపూడి.నాగమ్మ, పి.అన్నపూర్ణ సాంబశివరావు పాల్గొన్నారు.

4న భీమవరంలో ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈ నెల నాలుగో తేదీ ఉదయం 8 గంటల నుంచి భీమవరంలోని విష్ణు కాలేజీ, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజిలో కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. ఈ సందర్భంగా భీమవరంలో ఈ కింద విధంగా ట్రాఫిక్ మళ్లింపు చేయనున్నారు.

ట్రాఫిక్ డైవర్షన్ ఇలా..

1.విజయవాడ, గుడివాడ వైపు నుంచి వచ్చే అన్ని రకాల వాహనాలూ కాళ్ల మండలం పెదఅమిరం పుంతరోడ్డు మీదుగా, ఉండి రోడ్డుకు చేరుకుని భీమవరం పట్టణంలోకి ప్రవేశించాలి.

2.భీమవరం నుంచి వచ్చే కార్లు, బైక్‌లు తదితర చిన్న వాహనాలు సర్ ఆర్థర్ కాటన్ పార్క్ (జువ్వలపాలెం రోడ్డు) వద్ద డైవర్షన్ తీసుకుని చినఅమిరం మీదుగా కోపల్లె హై స్కూల్ వద్ద కాళ్ల రోడ్డు ఎక్కి గుడివాడ విజయవాడకు వెళ్లాలి.

3.పాలకొల్లు వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు బొంబాయి స్వీట్స్ వద్ద ఉండి రోడ్డుకు వచ్చి మల్టీప్లెస్ మీదుగా ఉండి, ఆకివీడు, కైకలూరు, విజయవాడ, గణపవరం, ఏలూరుకు, అలాగే పెదఅమిరం పుంతరోడ్డు నుంచి కాళ్ల గుడివాడ విజయవాడకు వెళ్లాలి.

4.తాడేపల్లిగూడెం నుంచి వచ్చే అన్ని రకాల వాహనాలూ గొల్లలకోడేరు వంతెన వద్ద డైవర్షన్ తీసుకుని పాలకోడేరు, కుముదవల్లి, మార్కెట్ యార్డు మీదుగా పాలకొల్లు వైపు, భీమవరం పట్టణంలోకి, ఉండి వైపు వెళ్లాలి.

5.భీమవరం నుంచి తాడేపల్లిగూడెం, తణుకు వెళ్లే వాహనదారులు బివి రాజు విగ్రహం వద్ద నుంచి ఉండి బైపాస్ మీదుగా మార్కెట్ యార్డు, కుముదవల్లి, పాలకోడేరు మీదుగా వెళ్లాలి.

6.జువ్వలపాలెం రోడ్డులో సర్ ఆర్థర్ కాటన్ పార్క్ నుంచి కాళ్ల రోడ్డు పెదఅమిరం పుంత రోడ్డు వరకూ నో వెహికల్ జోన్‌గా ప్రకటించారు. అలాగే ఉండి బైపాస్ రోడ్డులోని బివి రాజు విగ్రహం నుంచి గొల్లలకోడేరు విగ్రహం వరకూ నో వెహికల్ జోన్‌గా ప్రకటించారు.

పై ట్రాఫిక్ డైవెర్షన్స్‌ను భీమవరం పట్టణ, పరిసర ప్రాంత గ్రామ ప్రజలు గమనించి, జిల్లా పోలీసు వారికి సహకరించాలని జిల్లా ఎస్‌పి తెలిపారు.

పార్కింగ్ ప్రాంతాలు

1.ఆచంట, తణుకు నియోజకవర్గం నుంచి వచ్చేవారు విష్ణు క్యాంపస్ దగ్గరలోని అంజన, సంజన అపార్ట్‌మెంట్ వద్ద పార్కింగ్ చేసుకోవాలి.

2. నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గం నుంచి వచ్చే వారు కొవ్వాడ, అన్నవరం రోడ్డు మీదుగా విష్ణు ప్లే గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి.

3.భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి వచ్చేవారు నాగరాజు మాల్ వద్ద పార్కింగ్ చేసుకోవాలి.

4.ఉండి, తాడేపల్లిగూడెం నియోకవర్గం నుంచి వచ్చేవారు కాళ్ల రోడ్డులో ఉన్న శ్రీరామ కోల్డ్ స్టోరేజ్ వద్ద పార్కింగ్ చేసుకోవాలి.

కౌంటింగ్‌కు అంతా సిద్ధం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరంటౌన్

కౌంటింగ్ అధికారులకు, సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను కౌంటింగ్ పరిశీలకులు ఎం.దీప, ఎల్.నిర్మలరాజ్, బిడి.కుమావత్ సమక్షంలో పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్ వశిష్ఠ కాన్ఫరెన్స్ హాల్లో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన అధికారులకు, సిబ్బందికి నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ సెంటర్ విధులను కేటాయిస్తూ రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్ఐసి అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పూర్తి చేశారు. నరసాపురం పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇవిఎంలు, పోస్టల్ బ్యాలెట్లు లెక్కించేందుకు, పర్యవేక్షించేందుకు గాను కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు రిజర్వుడు స్టాఫ్‌తో కలిపి మొత్తం 959 మందికి సంబంధించి ర్యాండమైజేషన్ నిర్వహించారు. వీరిలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు 294 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 348 మంది, మైక్రో అబ్జర్వర్లు 317 మంది ఉన్నారు. ఎం.దీప తాడేపల్లిగూడెం, ఉండి, భీమవరం నియోజక వర్గాలకు, ఎల్.నిర్మలరాజ్ నరసాపురం, తణుకు నియోజక వర్గాలకు, బిడి.కుమావత్ ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాలకు కౌంటింగ్ పరిశీలకులుగా వ్యవహరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టరు, ఉండి నియోజకవర్గ ఆర్ఒ సివి.ప్రవీణ్ ఆదిత్య, డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, డ్వామా పీడీ ఎం.ప్రభాకరరావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఈ నెల 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. వెలగపూడి సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆదివారం సాధారణ ఎన్నికలు - 2024 కౌంటింగ్ ఏర్పాట్లు, ఎన్నికల సంబంధిత సమస్యలు, ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు, ఖచ్చితమైన ఫలితాలను త్వరితగతిన ప్రకటించేందుకు జిల్లాల వారీగా చేస్తున్న ముందస్తు ఏర్పాట్లు, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ విసి హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో సుమిత్ కుమార్ పాల్గొన్నారు.

అంజిబాబును కలిసిన రఘు రామకృష్ణంరాజు

భీమవరం టౌన్: జనసేన భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులును భీమవరంలోని ఆయన నివాసంలో ఆదివారం నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘు రామకష్ణంరాజు, జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జత్తుగ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులు పలు అంశాలపై చర్చించారు.

బాణసంచా కాల్చొద్దు, పూలదండలు తేవొద్దు

ఎంఎల్ఎ అభ్యర్థి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా టిడిపి శ్రేణులు బాణసంచా కాల్చడం, పూల దండలు వేయడం, ఊరేగింపు నిర్వహించడం చేయరాదని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ప్రజలను, కార్యకర్తలను కోరారు. ఆయన తన కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. జగన్ అరాచకానికి నాలుగో తేదీతో తెరపడనుందని, ఇప్పటికే అనేక న్యూస్ ఛానల్స్ టిడిపి, జనసేన, బిజెపి కూటమికి అనుకూలంగా ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ప్రకటించారని చెప్పారు. తాము ఈ 5 సంవత్సరాల్లో ప్రజలకు మరింత సేవ చేసి వారి మన్నల్ని పొందాలని తమ కార్యకర్తలకు కోరారు. ఐదేళ్లుగా ప్రజలు జగన్ అరాచక పాలతో విసుగుచెందారని, అందుకే పరిపాలనలో దక్షత కలిగిన చంద్రబాబు పట్ల సుముఖత చూపుతున్నారని చెప్పారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కట్టుబడి వారికి సహకరిద్దామని కోరారు.



బీచ్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో పర్యాటకులతో ఆదివారం సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు పర్యాటకులు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. వాతావరణం సానుకూలంగా ఉండడంతో అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటలలో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు.

15 మంది వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - తణుకు

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ఇంటికే పరిమితమై అనారోగ్యంతో ఉన్న వృద్ధులకు సంచారశకటం ద్వారా వైద్యులు ఆదివారం ఉచిత వైద్యసేవలు అందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలుమహేంద్ర, డాక్టర్ సాతులూరి అనుస్మితలు తణుకు టౌన్, మండపాక, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి సుమారు 15 మంది వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. డాక్టర్ కెవి రావు ఇండియా నెట్‌వర్కు ఫౌండేషన్ అమెరికా వారి ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు నాదెళ్ల కృష్ణానందంలు పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్యసేవలు కోరువారు స్వయంగా గాని, లేదా 9985343530 నెంబర్‌కి సంప్రదించాలని తెలిపారు.

శివరామరాజు విజయం కోరుతూ పాదయాత్ర

ప్రజాశక్తి - ఉండి

ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి, ఉండి మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు మూడోసారి ఎంఎల్‌ఎగా విజయం సాధించాలని ఉండి మండలం చెరుకువాడ గ్రామ ఉపసర్పంచి నడింపల్లి వెంకటరాజు చెరుకువాడ నుంచి జంగారెడ్డిగూడెం మండలం గురవాయి గూడెం పాదయాత్రగా వెళ్లి మద్ది ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుకు ఆదివారం బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరామరాజు రెండు పర్యాయాలు ఎంఎల్‌ఎగా పోటీ చేసిన సమయంలో ఇదే విధంగా మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకోవడం జరిగిందని, ఆయన ఆశీస్సులతోనే శివరామరాజు రెండు పర్యాయాలు ఎంఎల్‌ఎగా అఖండ మెజారిటీతో విజయం సాధించారన్నారు. 2019 ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసిన సమయంలో తాను అనివార్య కారణాల వల్ల మద్ది ఆంజనేయస్వామిని దర్శించుకోలేకపోయానని, కానీ నేడు ఆంజనేయ స్వామిని దర్శించుకుని శివరామరాజు అఖండ మెజారిటీతో గెలిచేలా ఆశీస్సులు అందించాలని ప్రత్యేక పూజలు నిర్వహించడానికి వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. మార్గ మధ్యలో పాములపర్రు గ్రామం వద్ద నడింపల్లి వెంకటరాజుకు బురిడీ రవిబాబు, దత్తు సంఘీభావం తెలిపారు.

వాసవి క్లబ్ సేవలు ఎనలేనివి

జిల్లా గవర్నర్ విఎల్ఎన్‌వి.ప్రసాద్

ప్రజాశక్తి - నరసాపురం

వాసవి క్లబ్ సేవలు ఎనలేనివి అని, ముందు ముందు మరిన్ని సేవలు చేయాలని వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ విఎల్ఎన్‌వి.ప్రసాద్ అన్నారు. వాసవి క్లబ్ జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్ నరసాపురం అప్పన్న ప్లాజా వాసవి సాయి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ పోటీలో జిల్లా గవర్నర్ ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించారు. షటిల్, చదరంగం, లూడో, క్యారమ్స్ పోటీలు మహిళలు, పురుషులకు వేరుగా నిర్వహించారు. ఈ పోటీలో ప్రతిభ చూపిన వారికి వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ విఎల్ఎన్‌వి ప్రసాద్ చేతుల మీదగా బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు జల్లూరి శ్రీనివాస్, ట్రెజరరీ నవీన్ గుప్తా, జనరల్ సెక్రటరీ పి.సత్యనారాయణ, అప్పన్న బద్రి వెంకట సుబ్బారావు, అప్పన్న, మురళీ ఫణి కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

విద్యార్థుల్లో సజనాత్మకతను వెలికి తీయాలి

బాలోత్సవం కమిటీ అధ్యక్షులు ఇందుకూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సంవత్సర కాలంగా బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో ఉన్నటువంటి సృజనాత్మకతను వెలికి తీసేందుకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నామని భీమవరం బాలోత్సవం కమిటీ అధ్యక్షులు ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. భీమవరం బాలోత్సవం ఆధ్వర్యంలో 2024 విద్యా సంవత్సరంలో, భీమవరం టౌన్, రూరల్ వీరవాసరం, పాలకోడేరు, ఉండి, ఆకివీడు మండలాల్లోని పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు భీమవరం యుటిఎఫ్ కార్యాలయంలో నగదు అవార్డులను ఆదివారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎంఆర్.రాజు ముఖ్యఅతిథిగా విచ్చేయగా వసుధ ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు విద్యా విలువలపై ప్రసంగించారు. సభకు భీమవరం బాలోత్సవం కమిటీ అధ్యక్షులు ఇందుకూరి ప్రసాదరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, వీరవాసరం మండలం రాయకుదురు, భీమవరం టౌన్ జెఎల్‌బి. హైస్కూలు, శృంగవక్షం, ఆకివీడు బాయ్స్ హైస్కూలు ఉండి మండలం ఎండగండి ప్రభుత్వ హైస్కూలు, భీమవరం మండలం కొవ్వాడ, కాళ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో అధిక మార్కులు సాధించిన ప్రతిభావంతులకు అవార్డులు ప్రశంసా పత్రాలు జ్ఞాపకాలు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ కార్యదర్శి సిహెచ్.పట్టాభి రామయ్య, ఉపాధ్యక్షులు గాతల జేమ్స్, కోశాధికారి పి.సీతారామరాజు, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, మానవతా సేవా సంస్థ అధ్యక్షులు బుద్ధరాజు వెంకటపతి రాజు, విజ్ఞాన వేదిక అధ్యక్షులు అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని అజ్జమూరు గ్రామంలోని ఫిష్ ప్యాకింగ్ నుంచి చేపలు ప్యాకింగ్ లోడ్ చేసుకొని ఆకివీడు వైపు వస్తున్న లారీ మలుపులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో ఒక్కసారిగా భారీ శబ్దం ఏర్పడి వైర్లు తెగి విద్యుత్ అంతరాయం కలిగింది. లారీలో ఉన్న కార్మికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే అదే సమయంలో తెగిన విద్యుత్ వైర్లు కార్మికుల మీద నుంచి కిందపడ్డాయి. తెగిన కొసలు ఎవరికీ తగలకుండా పక్కనుంచి పడడంతో భారీ ప్రమాదం తప్పినట్లైంది. వారికి తగిలినట్లు అయితే వారితో పాటు చేపల్లారి కూడా తీవ్రమైన ప్రమాదం జరిగి ఉండేది. కొద్దిలో అక్కడి వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం: అజ్జమూరులో విద్యుత్ వైర్లు తెగిపడడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అతరాయం కలిగింది. మధ్యాహ్నం జరిగిన ప్రమాదం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గించింది. అనంతరం సిబ్బంది కృషి చేసి విద్యుత్ అందించారు.

అతి తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్య

జానకి విద్యా సంస్థల సొంతం

జానకి విద్యాసంస్థల సెక్రెటరీ, కరస్పాండెంట్ ఏగి జక్రయ్య



జానకి జూనియర్ కాలేజ్ భవనం..



ప్రజాశక్తి - నరసాపురం

అతి తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్యను అందించే లక్ష్యంగా జానకి విద్యాసంస్థలు పని చేస్తున్నాయని సెక్రెటరీ, కరస్పాండెంట్ ఏగి జక్రయ్య అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సాధారణ విద్యార్థుల నుంచి సైతం అసాధారణ ఫలితాలు తెప్పిస్తున్న సంస్థ జానకి అన్నారు. నరసాపురం మండలం సీతారాంపురం గ్రామంలో 2003 జూన్ 5వ తేదీన జానకి స్కూలు ఏర్పాటు చేసామన్నారు. గడిచిన పదహారేళ్లుగా యాజమాన్యమే అధ్యాపకులుగా ఉండి ప్రాథమిక స్థాయి నుంచి హైస్కూల్ స్థాయికి విస్తరించిందన్నారు. ఒత్తిడికి స్వస్తి చెప్పి, సహజ ప్రతిభకు సానపడుతూ ప్రతి విద్యార్థిని విశ్లేషించి, నైతిక విలువలను పెంచుతున్నామన్నారు. విద్యాబోధనను యాంత్రికంగా కాక సాంకేతిక పరిజ్ఞానంతో సాధారణ విద్యార్థులతో సైతం అసాధారణ విజయాలతో ముందుకు వెళ్తున్నా మన్నారు. పదో తరగతి ఫలితాల్లో మంచి ర్యాంకులు సాధించిన సంస్థ జానకి అని తెలిపారు. అందరి మన్ననలతో, ఆశీస్సులతో ఇంకొక అడుగు ముందుకు వేస్తూ నరసాపురం పట్టణంలో 2018వ సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాల ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్మీడియట్ స్థాయిలో కూడా నేడు ప్రపంచీకరణ విసురుతున్న సవాళ్లకు దీటుగా సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో చరిత్రను సృష్టించగలిగి, లక్ష్యాలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలనే లక్ష్యంతో అత్యంత అనుభవజ్ఞులైన సీనియర్ అధ్యాపకులతో జానకి జూనియర్ కాలేజీ నడుస్తుందన్నారు. ఇంటర్ విద్య హై టెక్నాలజీ, డిజిటల్ టెక్నాలజీ ద్వారా విద్యా బోధన చేస్తున్నామన్నారు.



సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు

అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ప్రణాళికాబద్ధమైన విద్యా బోధన, పర్యవేక్షణతో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామన్నారు. 2023 ఇంటర్మీడియట్ ఎంపిసి ఫలితాల్లో యల్ల మౌనిక 458/470, మన్నే మోహన్ వెంకట్ 453/470 మార్కులు సాధించారన్నారు. కేవలం 51 మంది విద్యార్థులతో ఇంటర్మీడియట్ 2023-24 ఫలితాల్లో ప్రతి నలుగురు విద్యార్థుల్లో ఒకరికి 400పైగా మార్కులు మా విద్యార్థులు సాధించారన్నారు. 2023 ఎంసెట్‌లో 30 మంది విద్యార్థులు రాయగా 28 మంది ఉచితంగా ఇంజనీరింగ్ సీట్లు సాధించారన్నారు. జానకి జూనియర్ కళాశాలలో ఎంపిసి, బైపిసి గ్రూపులకు అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. జెఇఇ, నీట్ ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. పదో తరగతి ఫలితాల్లో వై.జెన్నీషా 577/600 మంచి మార్కులు సాధించిందన్నారు. ప్రస్తుతం జానకి స్కూల్లో ఎల్‌కెజి నుంచి జూనియర్ ఇంటర్ వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. మరిన్ని వివరాలకు 9441035726 నెంబర్‌ను సంప్రదించగలరని తెలిపారు.

జానకి స్కూల్, కాలేజీ ప్రత్యేకతలు

- పరిమితి సంఖ్యలో విద్యార్థులు, అత్యుత్తమ, ఆధునిక విద్య
- ప్రతి విద్యార్థి పట్ల, క్రమశిక్షణ పట్ల వ్యక్తిగత శ్రద్ధ
- స్పోకెన్ ఇంగ్లీష్, మెడిటేషన్, మైండ్ పవర్ టెక్నిక్స్
- సెమినార్, గెస్ట్ లెక్చర్స్, స్టడీ అవర్స్ నిర్వహణ
- వీక్లీ , మంత్లీ ఎగ్జామ్స్ నిర్వహించి విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియపరచుట
- ఫండమెంటల్ పై ప్రత్యేక శ్రద్ధ
- అత్యాధునిక ప్రయోగశాలు కలిగి థియరీతో పాటు ప్రయోగాలకు సమాన ప్రాధాన్యత
- శారీరక, మానసిక వికాసం కోసం విశాలమైన ఆట స్థలం
- వ్యాన్ సౌకర్యం కలదు

జానపద కళా రూపాల అభ్యున్నతికి 'దుగ్గిరాల' కృషి అభినందనీయం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

దేశ భక్తుడు, ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతి వేడుకలను క్విట్ ఇండియా స్థూపం వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ సభ్యులు కామన రామకృష్ణ, వీరవల్లి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ఎందరో త్యాగ ధనుల త్యాగ ఫలితామే నేడు స్వేచ్ఛ భారతమని, దేశభక్తుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య త్యాగం అజరామమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ తెలుగు నాట జానపద కళా రూపాల పునరుద్ధరణకు, గ్రంథాలయాల వ్యాప్తికి గోపాలకృష్ణయ్య ఇతోధికంగా కృషి చేశారని, ఆయన ప్రచారం చేసిన జానపద కళారీతులు - తోలుబొమ్మలాట, జముకుల కథ, బుర్రకథ, వీధి నాటకాలు, సాము గరిడీలు, గొల్ల కలాపం, బుట్ట బొమ్మలు, కీలు గుర్రాలు, వాలకాలు, గోసంగి, గురవయ్యలు, సరదా కథ, కిన్నెర కథ, కొమ్ము బూర, జోడు మద్దెల, పల్లె సుద్దులు, తూర్పు భాగోతం, చుట్టు కాముడు, పిచ్చికుంట్లవాళ్ళ కథ, సాధనా శూరులు, పలనాటి వీర విద్యావంతులని అన్నారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్ రాజు, ఉండపల్లి రమేష్ నాయుడు, సూర్యనారాయణ, ఎస్‌కె.చాన్ భాషా, ఆర్ఎస్.సూర్యనారాయణ, ఎస్.వెంకటేశ్వరావు, కెజి.రాజు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

సిఐ సత్య కిషోర్

భీమవరం టౌన్: మనిషిలో శాంతి లక్షణం ప్రశాంతత జీవనానికి మార్గదర్శకమని, శాంతి లేని ప్రదేశాల్లో అశాంతి ప్రభలుతుందని ఆందోళనలు, అరాచకాలు ప్రశాంత జీవితానికి అడ్డంకులుగా నిలుస్తాయని భీమవరం రూరల్ సిఐ సత్య కిషోర్ అన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో ప్లకార్డ్లతో సూచించారు. స్వీప్ యాక్టివిటీస్‌లో భాగంగా శాంతి భద్రతలకు విఘాతం అనర్థం అనే నినాదంతో రూరల్ పోలీస్ స్టేషల్‌లో కౌంటింగ్ రోజున ప్రజలు సహకారం అందించాలని కోరుతూ ప్రచార భేరి నిర్వహించారు. సిఐ సత్య కిషోర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగాయని, శాంతియుతంగా అందరూ సహకరించారని, ఈనెల 4న జరిగే కౌంటింగ్ రోజున అందరూ ఇదే స్ఫూర్తితో సహకరించాలని కోరారు. స్వీప్ యాక్టివిటీస్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ శాంతి సామరస్యాలతోనే సమాజ ప్రగతి అని, కౌంటింగ్ రోజున ప్రతిఒక్కరూ బాధ్యత రహితంగా ఉండాలని అన్నారు. రోటరీ క్లబ్ సభ్యులు బాబాజీ సాహెబ్ పాల్గొన్నారు.

ఆకివీడు: సాధారణ ఎన్నికల ఫలితాలు ఈనెల 4వ తేదీన వెలువడనున్న సందర్భంగా ఏ ఒక్కరు ఆవేశాలకు, ఆందోళనలకు గురికావద్దని పోలీస్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వైవి.సత్యనారాయణ ప్రజలకు సూచించారు. ఆదివారం స్థానిక మాదివాడతో సహా పలు ప్రదేశాలలో సిఐ సత్యనారాయణ ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. గెలుపోటములు సాధారణంగా తీసుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వవద్దని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. ఏవిధమైన ప్రతికూల చర్యలు జరగకుండా చూడాలని ఆయన కోరారు. ఎస్ఐ బత్తిని నాగబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతిని పాటించాలని కోరారు.

ఒఎన్‌జిసి పైపులైను పనులు పూర్తి

ప్రజాశక్తి - నరసాపురం




పనులను పర్యవేక్షిస్తున్న అధికారి

ఉద్రిక్తంగా మారిన ఒఎన్‌జిసి పైపులైన్ పనులు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. సీతారామపురం సౌత్ గ్రామంలోని ఒఎన్‌జిసి బావి వద్ద నుంచి రుస్తుంబాద ప్రధాన కార్యాలయంలో ఉన్న నంబర్ 4కి అనుసంధానం చేస్తూ చేపట్టిన పైపు లైన్ పనులను కొన్నిరోజుల క్రితం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులకు, అధికారులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఒఎన్‌జిసి, రైతులతో కలెక్టర్ సుమిత్ కుమార్ చర్చలు జరిపి, సమస్యను పరిష్కరించి పైపులైన్ పనులకు దారి చూపారు. దీంతో సీతారామపురం సౌత్ నుంచి రుస్తుంబాద, వైఎస్ పాలెం గ్రామాలు మీదుగా నర్సాపురం నంబర్ 4 వరకు 1.5 కిలోమీటర్ల మేర పైపు లైన్ పనులు చేపట్టారు. 70 మందికి పైగా రైతులు స్థలాలో నుంచి పైపు లైన్ వెళ్తున్నట్లుగా అధికారులు గుర్తించారు. వీరికి ఒఎన్‌జిసి పరిహారం అందించేలా కలెక్టర్ చర్యలు చేపట్టారు. పైపు లైన్ పనులను ఈ నెల 17 నుంచి ప్రారంభించారు. మధ్యలో కొన్ని రోజులు పనులకు బ్రేక్ పడినప్పటికీ వేగవంతంగా నిర్వహించి సకాలంలో పూర్తి చేశారు.

వాతావరణ మార్పులతో ఆక్వా రైతుల అవస్థలు

ప్రజాశక్తి - మొగల్తూరు



చెరువులో తిరుగుతున్న ఏరియేటర్

వాతావరణ మార్పులతో ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నాలుగు రోజులుగా సంభవించిన వాతావరణ మార్పులతో ఆక్వా సాగు చేస్తున్న చెరువులలో చేపలు రొయ్యలకు ఊపిరి ఆడక మృత్యువాత పడుతున్నాయి. సుమారు నెలరోజులుగా ఎండలు బొగ్గుమన్నాయి. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో చెరువులోని మత్స్యసంపద మృతి చెందడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. వాటిని కాపాడుకునేందుకు చెరువులలో నిరంతరాయంగా ఏరియేటర్లు తిప్పుతున్నారు. దీనికి విద్యుత్ చార్జీలు, డీజిల్ ఖర్చులు భారంగా మారాయని అక్వారైతులు వాపోతున్నారు. అమ్మకాలు సాగించే రైతులకు కొనుగోలుదారులను బతిమాలి విక్రయించవలసి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్టాండ్ వద్ద ఆక్రమణలు తొలగింపు

మున్సిపల్ అధికారులను అభినందించిన ప్రజలు



ఆక్రమణలు తొలగించి శుభ్రం చేసిన అధికారులు

పాలకొల్లు: పాలకొల్లు బస్టాండ్ వద్ద మురుగు కాల్వలు చాలా కాలం నుంచి పూడికపోవడంతో మున్సిపల్ అధికారులు నడుంకట్టి ఆక్రమణలు తొలిగించారు. బస్టాండ్ చుట్టూ ఆక్రమణలు పెరిగి మురుగు అంతా నిల్వ ఉంటోంది. కొద్ది మంది మున్సిపల్ షాపులు అద్దెకు తీసుకుని వారు ఇతరులకు పలు షాపులకు అద్దెకు ఇస్తూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నారు. అయినా రాజకీయ పలుకుబడితో సామ్రాజ్యంను విస్తరించారు. పోలీసులు పండ్లు, ఫలహారాలు ఉన్నతాధికారులకు ఇస్తూ ఆక్రమణలు సంగతి పట్టించుకోలేదు. కనీసం డ్రెయిన్‌ల్లో సిల్ట్ తీయడానికి అవకాశం లేకపోయింది. అయినా గత 4 సంవత్సరాలుగా మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోలేదు. రెవెన్యూ, పోలీస్ అధికారులు కూడా చర్యలు తీసుకోలేదు. ఇటీవల బస్టాండ్‌లో మురుగు నిల్వ ఉండటంతో పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో మున్సిపల్ కమిషనర్ విజయ్ సారధి, ఆర్ఐ శ్రీనివాస్ రాజు, టిపిఒలు బ్రహ్మం, టిపిఎస్ త్రినాథరావు, సిబ్బంది చొరవ తీసుకుని ఏళ్ల నాటి ఆక్రమణలు తొలిగించారు. మున్సిపల్ కౌన్సిల్ లేకపోవడం, పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఎన్నికల డ్యూటీలో ఉన్న వైసిపి నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చినా లెక్క చేయకుండా ఆదివారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆక్రమణలు తొలిగించారు. దీంతో ప్రజలు వారిని శభాష్ అంటున్నారు.

స్త్రీలపై పెరుగుతున్న శ్రమ దోపిడీ

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి - నరసాపురం



మాట్లాడుతున్న రాష్ట్ర కోశాధికారి సావిత్రి

భారతదేశంలో స్వాతంత్రం అనంతరం కూడా స్వేచ్ఛ పొందలేకపోయారని, పెట్టుబడిదారీ వ్యవస్థ మూలంగా స్త్రీల మీద శ్రమ దోపిడీ పెరుగుతుందని, సంస్థలు కారు చౌకగా మహిళల చేత పనిచేయుచుకుంటున్నారని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. ఆదివారం రెండో రోజు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర శిక్షణా తరగతులు కొనసాగాయి. పట్టణంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ కుటుంబంలో స్త్రీల పనిపై గుర్తింపు లేదన్నారు. ఫలితంగా స్త్రీలు అనివార్యంగా ఉద్యమాలు చేస్తున్నారన్నారు. ప్రస్తుత కాలంలో మహిళా ఉద్యమాల్లో స్త్రీలు పాల్గొనడం పెద్ద ఎత్తున పెరిగిందన్నారు. ఫలితంగా పార్టీలు మహిళా సంక్షేమ పథకాలను ప్రకటిస్తున్నాయి కానీ ఇవి కంటి తుడుపు మాత్రమే అన్నారు. సంపూర్ణ, సమానత్వ సాధన కోసం అన్ని తరగతులు మహిళలను కలుపుకొని పురుషులతో కలిపి సామాజిక అసమానతలకు, ఆర్థిక సమస్యలకు వ్యతిరేకంగా పోరాటం ద్వారానే స్త్రీల విముక్తి సాధించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ, అధ్యక్షురాలు కేతా పద్మజ, ఎస్.ఉదయ్ కుమారి, ఎస్.జయప్రభ, రాణి, శ్యామల, సీత, రోజామణి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలి

జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎం.దీప

ప్రజాశక్తి - భీమవరం టౌన్



కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న పరిశీలకులు దీప, కలెక్టర్

ఈనెల 4న నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియలో ప్రతిఒక్కరూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎం.దీప తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉండి, భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలను ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎం.దీప జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దీప మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బంది అప్రమత్తంగా తమకు కేటాయించిన పనులలో ప్రధాన భూమికను పోషించి, విధులను నిర్వర్తించాలని సూచించారు. విధులలో పాల్గొన్న సిబ్బంది బాధ్యతాహితంగా విధులు నిర్వర్తించాలన్నారు. సూక్ష్మ పరిశీలకులకు ప్రతీ రౌండ్ కీలకమని పేర్కొన్నారు. ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని, ఎక్కడా పొరపాట్లు దొర్లకూడదని సూచించారు. అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లను ఏజెంట్లకు చూపించాలని, వారినుంచి సంతకాలు తీసుకోవాలని చెప్పారు. ఇవిఎం మిషన్లను తీసుకువచ్చేటప్పుడు, ఓట్లను లెక్కించేటప్పుడు మిషన్లు పాడవ్వకుండా తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. ఈనెల 4వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటలకే కౌంటింగ్ సిబ్బంది ఆయా కౌంటింగ్ కేంద్రాలకు ఖచ్చితంగా చేరుకోవాలనే చూడాలన్నారు. ఎలాంటి సందేహాలు, అనుమానాలు ఉన్నా కూడా వెంటనే వాటిని నివృత్తి చేసుకోవాలన్నారు. విధుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా పూర్తిస్థాయి ఫలితాలు వెల్లడి అయ్యేవరకు బాధ్యతాయుతంగా తమ విధులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆర్‌ఒలను సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్, ఉండి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి సివి.ప్రవీణ్ ఆదిత్య, భీమవరం ఆర్‌డిఒ, భీమవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.శ్రీనివాసులు రాజు, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ, రిటర్నింగ్ అధికారి కె.చెన్నయ్య ఉన్నారు.

పోలీసుల సేవలు అభినందనీయం

కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గత రెండు మాసాల నుంచి జిల్లాలో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు పూర్తి కావడానికి మీ వంతు సహకారం ఎంతో గొప్పదని పోలీసులను జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ అభినందించారు. ఆదివారం జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం దగ్గర కేంద్ర, రాష్ట్ర బలగాలతో నిర్వహించిన పెరేడ్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్, జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో కౌంటింగ్ కూడా ప్రశాంతంగా పూర్తి కావడానికి నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కోరారు. పోలీసు అధికారులు, సిబ్బంది సేవల వల్ల శాంతి భద్రతలు పరిరక్షణకు దోహదపడ్డాయన్నారు. ఎన్నికల కౌంటింగు అయిన అనంతరం మరో రెండు రోజులపాటు మీకు ఏర్పాటు చేసిన ప్రాంతాలలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ప్రజలకు భరోసా కల్పించాలన్నారు. కట్టుదిట్టమైన భద్రత కల్పించి శాంతి భద్రతలను పరిరక్షించాలని జిల్లా కలెక్టరు సమిత్ కుమార్ కోరారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ మీకు విధులు కేటాయించిన ప్రాంతాలలో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మీకు ఏ విధమైన లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ వచ్చిన వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల తెలిపారు. అనంతరం అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ఎస్ఆర్ కెఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వరకూ నిర్వహించిన కవాతులో వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, అదనపు ఎస్‌పి వి.భీమారావు, పలువురు డిఎస్‌పిలు, సిఐలు, పోలీసులు ఉన్నారు.



పెనుమంట్ర: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కొనసాగిన వేసవి శిక్షణా శిబిరాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో ఆదివారం విద్యార్థులకు బుక్ రీడింగ్, కంప్యూటర్ వినియోగం గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వీరికి బుక్ రీడింగ్‌లో మంచి పుస్తకాలను ఎలా ఎంచుకోవాలో విశ్రాంత ఆంగ్ల ఉపాధ్యాయిని పి.సువర్ణగౌరి వివరించారు. స్పోకెన్ ఇంగ్లీషుతో పాటు చదవడం, రాయడం లో మెళకువలు గురించి ఆమె చెప్పారు. అనంతరం గ్రంథాలయాలు విశిష్టత గురించి వ్యాసరచన పోటీని నిర్వహించారు. నిత్య జీవితంలో కంప్యూటర్ వినియోగం గురించి కర్రి వెంకట రామారెడ్డి పిల్లలకు అవగాహన కల్పించారు. పలువురు విద్యార్థులతో పాటు గ్రంథాలయం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గుడిమెట్ల రామరెడ్డి, లైబ్రేరియన్ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : విద్యార్థుల జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగడానికి మంచి మార్గాన్ని ఎంచుకోవాలని న్యాయవాది నెల్లి సతీష్ కుమార్ విద్యార్థులకు సూచించారు. అందులోనే ప్రధానమైనది 789 ఫార్ములా అని ఆయన చెప్పారు. ఈ సూత్రాన్ని పాటించడం ద్వారా జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని ఆయన అన్నారు. స్థానిక మాదివాడలోని జిల్లా శాఖ గ్రంథాలయంలో లీడర్స్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా ఆదివారం ఆయన విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. శిబిరంలో ఆయన మాట్లాడుతూ 789 మూడు అంకెలు కూడితే 24 వస్తుందన్నారు. అంటే రోజులో 24 గంటలు ఉంటాయని, వాటిలో మొదట వచ్చే 7 అనగా ఏడు గంటలని విద్యార్థి విశ్రాంతి తీసుకోవడానికి అంటే నిద్రపోవడానికి ఖచ్చితంగా ఉపయోగించాలన్నారు. ఇక చివరగా వచ్చే అంకె తొమ్మిది. ఈ 9 అంటే సమయాన్ని సూచిస్తోందని, ఈ తొమ్మిది గంటల సమయాన్ని మనకు నచ్చిన విధంగా ఉపయోగించుకోవచ్చున్నారు. విద్యార్థులకు కావలసిన విధంగా పొందడానికి కాలకృత్యాలతో సహ కలుపుకొని వారికి కావలసిన నచ్చిన విధంగా ఆటలాడడం, ఇతర అభిరుచులు నెరవేర్చుకోవడానికి ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. ఇక మధ్యలో ఉన్న ఎనిమిది అంకె విద్యార్థి జీవితానికి చాలా అత్యవసరమైనదని చెప్పారు. చదువు కోసం ఖచ్చితంగా ఉపయోగించుకోవాల్సిన సమయం అన్నారు. ప్రతిరోజు 8 గంటలు అత్యంత శ్రద్ధగా విద్యార్థి విద్యను అర్జించడానికి ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషోర్, గ్రంథ పాలకురాలు పార్వతి, రీడర్స్ ఫోరం అధ్యక్షులు దాసరి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆర్థికసాయం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కేన్సర్ రోగికి రూ.10 వేలు సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మండలం గొల్లవాని చెరువు గ్రామానికి చెందిన కొక్కిరిగడ్డ జ్యోతి(45) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయాన్ని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధ రాజు వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజుకి తెలిపారు. వెంటనే వారు స్పందించి రూ.10 వేల చెక్కును పేషెంట్‌కు పంపించారు. ఆ చెక్కును ఆదివారం ఫౌండేషన్ కన్వీనర్ బుద్ధరాజు ఇంటి వద్ద అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, డైరెక్టర్ ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ పెదపాటి పెద్దిరాజు, కె.జాన్ పాల్గొన్నారు. రోగికి ఆర్థిక సహాయం చేసినందుకు పేషంటు, ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజుకి కృతజ్ఞతలు తెలిపారు.

చిన్నారి బాలలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

హనుమాన్ జయంతి సందర్భంగా మార్టేరులోని ఆలయం వద్ద చిన్నారి బాల బాలికలకు ఆలయ నిర్వాహకులు బహుమతులు అందజేశారు. పిల్లలకు వానరసేన అనే పేరుతో హాజరైన వందలాది పిల్లల నుంచి లక్కీ డిప్ ద్వారా 50 మంది విజేతలకు విలువైన గిఫ్ట్ ప్యాక్‌లను నిర్వాహకులు కర్రి అచ్యుతరామారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా చక్కని కార్యక్రమం నిర్వహించిన నిర్వాహకులను పలువురు అభినందించారు.

ముత్యాలమ్మ ఆలయం యాత్రికులతో కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. యాత్రికులు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ, తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.